అమ్మో.. సమ్మె!



పలు కార్మిక సంఘాల తీరుతో తమ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడేలా ఉందని స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టాలను సాకుగా చూపి ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం యోచిస్తున్న తరుణంలో నేతలు వేసే అడుగులు.. చేసే పోరాటం నిర్మాణాత్మకంగా ఉండాలని సూచిస్తున్నారు. స్టీల్ ప్లాంట్‌లో జీతాల్లేక సతమతమవుతుంటే... సెయిల్ కార్మికుల బోనస్ కోసం ఇక్కడ సమ్మె నోటీసు ఇవ్వడం సమంజసం కాదని పేర్కొంటున్నారు.

- సెయిల్ కార్మికుల బోనస్ కోసం సమ్మె నోటీసు
- మెజార్టీ ఉక్కు కార్మిక సంఘాల విముఖత
- ఆందోళనలో కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈనెల 28న సమ్మె చేస్తామని కార్మిక సంఘాలు ఇచ్చిన నోటీసుపై కార్మికుల్లో విస్తృత చర్చ జరుగుతోంది. సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే ఉత్పత్తి పెరుగుతున్న పరిస్థితుల్లో సమ్మె అవసరమా అనే ప్రశ్న మెజార్టీ కార్మికుల్లో వ్యక్తమతోంది. సెయిల్ కార్మికుల బోనస్ పెంపు , వేతన సవరణలో పెండింగ్ అంశాల కోసం అక్కడి సంఘాలు సమ్మె నోటీసు ఇచ్చాయి. ప్రతీ అంశానికి సెయిల్‌ను అనుకరించి సమ్మె చేయించే ఎన్‌జేసీఎస్ కార్మిక సంఘాల నాయకులు అక్కడి జాతీయ నాయకుల ఆదేశాల మేరకు ఇక్కడ కూడా సమ్మె నోటీసు ఇచ్చారు.

ఇక్కడి సమస్యలు గాలికి ..

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ కోత, కరెంటు చార్జీల పెంపుపై ఆందోళన చేసి వెనుకడుగు వేశాయి. ఇలాంటి తరుణంలో సెయిల్ కార్మికుల కోసం సమ్మె నోటీసు ఇవ్వడం ఎంత వరకూ సమంజసమో ఆలోచించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గాడిన పడుతున్న సమయంలో...

ఒక్క బ్లాస్ట్‌ఫర్నేస్ వల్ల రోజుకు రూ.10 కోట్లు నష్టం వాటిల్లుతుంది. కేంద్ర ఉక్కుమంత్రి త్వశాఖ కనుసన్నల్లో ఇప్పుడిప్పుడే ఒక బ్లాస్ట్‌ఫర్నేస్ నుంచి రెండో బ్లాస్ట్‌ఫర్నేస్‌కు ఉత్పత్తి పెంచే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈనెలాఖరున రెండో ఫర్నేస్‌కు లైటప్ చేయడానికి ముహూర్తం నిర్ణయించారు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఏడాది మార్చి నాటికి తమ పరిస్థితి మరింత మెరుగవుతుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో సమ్మె చేయడమంటే తమ కళ్లు తామే పొడుచుకున్నట్టవుతుందని కార్మికులు భావిస్తున్నారు.

కార్మిక సంఘాలపై అపనమ్మకం

ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న వరుస పరిణామాలు కార్మికులకు కార్మిక సంఘాలపై నమ్మకం పోయేలా చేశాయని చెప్పవచ్చు.హెచ్‌ఆర్‌ఏ కూడా పోగొట్టుకున్నారు. కరెంటు చార్జీల విషయంలో కూడా యాజమాన్యాన్ని ఒప్పించలేక, చివరకు ఒకటో తేదీన జీతం ఇప్పించడంలో కూడా విఫలమైన ప్రధాన కార్మిక సంఘాల తీరును కార్మిక వర్గం తీవ్రంగా నిరసిస్తోంది.

స్టీల్ కార్మికుల కోసం సెయిల్‌లో సమ్మె చేశారా?

వేతన సవరణ కోసం అనేక సార్లు సెయిల్ ప్లాంట్లతో కలిపి విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు సమ్మె చేశారు. ఆ సమ్మెల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు 95 శాతం సమ్మె చేయగా సెయిల్ కార్మికులు 30 నుంచి 40 శాతం మాత్రమే సమ్మెలో పాల్గొనేవారు. ఆ సమయంలో కూడా సెయిల్ కార్మికుల వేతన సవరణ జరిగిందే తప్పా.. విశాఖ ఉక్కు కార్మికులకు వేతన సవరణ జరగలేదు. సెయిల్ సమస్యల కోసం సమ్మె చేయాలని నిర్ణయించిన నాయకులు విశాఖ స్టీల్ కార్మికుల వేతన సవరణ కోసం సెయిల్ కార్మికులు ఒక్క రోజైనా సమ్మె చేశారా అని ఆలోచించాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

సమంజసం కాదు



1400 రోజులుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నాం. వేతన సవరణ చేసుకోలేకపోయాం. హెచ్‌ఆర్‌ఏ నిలుపుకోలేక పోయాం. ఇప్పుడు ఉత్పత్తి పెంచే పరిస్థితుల్లో సమ్మె చేయడం కార్మిక ప్రయోజనాలు కాపాడకపోగా కర్మాగారం, కార్మికులకు నష్టం కలిగించే చర్యగా భావిస్తున్నాం.

–డి. సురేష్‌బాబు, ప్రధానకార్యదర్శి, సీఎఫ్‌టీయూఐ

సమ్మె అనవసరం



సెయిల్ డిమాండ్లకు స్టీల్‌ప్లాంట్ పరిస్థితులకు పూర్తిగా తేడా ఉంది. ఇప్పుడిప్పుడే ఉత్పత్తి కుదుట పడుతుంది. సెయిల్ కార్మికుల బోనస్ కోసం ఇక్కడ సమ్మె చేయడం అన్యాయం. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై సమ్మె చేయాలి తప్పా సెయిల్ సమస్యలపై సమ్మె చేయడాన్ని మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

– డి.వి. రమణ, ప్రధానకార్యదర్శి డీవీఆర్ ట్రేడ్ యూనియన్

శ్రీకృష్ణదేవరాయలు కృషితో తెలుగు భాషకు గుర్తింపు



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరాయల విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: ఆంధ్రభోజ్యుడు శ్రీకృష్ణదేవరాయలు కృషి వల్లే తెలుగుభాషకు ప్రాచీన హోదా దక్కిందని ప్రజాసంఘాల నాయకులు కరణం జోగినాయుడు, బలిరెడ్డి సత్యనారాయణ అన్నారు. శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా 85వ వార్డు గొన్నవానిపాలెంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల, ప్రజల సంక్షేమం కోసం చెరువులు, నేల బావులు తవ్వించిన ఘనత ఆయకే దక్కుతుందన్నారు. తిరుపతి, సింహాచలం దేవస్థానాలను సందర్శించి విలువైన ఆభరణాలు బహుకరించారన్నారు. కార్యక్రమంలో గొన్నా అప్పారావు, సీహెచ్.అప్పలరాజు, పి.గురునాథ రావు, వై.జానకీరామ్, సూర్యనారాయణ, డి.ఎం. నాయుడు పాల్గొన్నారు.

గాజువాక: శ్రీకృష్ణ దేవరాయలకు నడుపూరు కృష్ణ దేవరాయ యూత్ సభ్యులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. దేవరాయల వర్ధంతి సందర్భంగా చినగంట్యాడ జగ్గు జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాజువాక కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్యాన్ని మూడు దశాబ్దాల పాటు పాలించిన మహాచక్రవర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఇందల సంతోష్, మనోజ్, షన్ముఖ, రాజు, రమేష్, యశ్వంత్, జగదీష్, గోపీ, జయరామ్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపై కేంద్రం తీరు దారుణం



రిలే దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఆక్షేపనీయమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెం కూడలిలో గురువారం చేపట్టిన 1344వరోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు విశాఖ ఉక్కును కాపాడుతామని ప్రకటనలు చేస్తున్నారని.. కాని దీనికి భిన్నంగా ప్రభుత్వ పెద్దలు అడుగులు వేస్తుంటే కిమ్మనకుండా చూస్తున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ జాతీయ సంపదని, కాపాడాల్సిన కేంద్రం తెగనమ్మడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుందన్నారు. జాతీయ సొత్తును పరిరక్షించాల్సిన పాలకులు వాటిని అమ్మి తలోకొంత సొమ్ము చేసుకోడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. సెయిల్‌లో విలీనం చేసి వెంటనే ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.రాజబాబు, మసేనురావు, డి.దేముడు, సీహెచ్. శ్రీనివాసరావు, జాన్సన్, శంకరరావు, గుమ్మడి నరేంద్రకుమార్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దంత సంరక్షణపై అవగాహన అవసరం



విద్యార్థుల దంతాలను పరీక్షిస్తున్న డాక్టర్ సువర్ణమణి

పెదగంట్యాడ: దంత సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యా శాఖాధికారి శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని బాపూజీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో దుర్గా మల్లేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారత్ డెంటల్ కేర్ సౌజన్యంతో గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. నోటి శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సువర్ణ మణి విద్యార్థుల దంతాలను పరీక్షించారు. చిన్న చిన్న సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దేవానంద్, పరుషోత్తం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో ఎంపికలు వాయిదా

అగనంపూడి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించాల్సిన ఖోఖో అండర్‌-14 పోటీలు, ఎంపికలు వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. మైదానం పూర్తిగా బురదమయం కావడంతో రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన



దుర్గాదేవి రూపంలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి నిర్వాసితకాలనీలోని ఎన్టీఆర్ పార్క్ ఆవరణలో దసరా ఉత్సవాల సందర్భంగా కనక దుర్గమ్మ రూపంలో దీపాలంకణ చేశారు. అమ్మవారి ప్రతిబింబానికి రంగులు అద్దగా, మిగిలిన భాగాన్ని దీపాలు, మధ్యలో పుష్పాల రెక్కలతో అలంకరించి అమ్మవారు సజీవంగా ఉన్నట్టు రూపుదిద్దారు. కార్యక్రమంలోభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న దినేష్ బాబు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ, ఆయన తనయుడు దినేష్ బాబు ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవారి పల్లకీ ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

‘పీఎం విశ్వకర్మ’తో ప్రయోజనం

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ పథకంతో 18 రకాల చేతి వృత్తుల కళాకారులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ పథకంపై గాజువాక జోనల్ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు అందజేశారు. వడ్రంగి, కుమ్మరి, తాపీ మేస్త్రీ, పూలు అమ్మేవారు, బొమ్మలు తయారు చేసేవారికి వారం రోజుల పాటు వారం ఉచితంగా శిక్షణ ఇచ్చి పని ముట్ల కోసం రూ.15వేల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు



వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిసున్న పాఠకులు

అగనంపూడి: పవిత్రమైన రామాయణాన్ని ప్రవచించిన వాల్మీమహర్షి జయంతిని గురువారం అగనంపూడి లో ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైందవ జాతికి మార్గదర్శకం చేసిన ఆయన సేవలు నిరుపమానమన్నారు. కార్యక్రమంలో కరణం సత్యారావు, పైడిరాజు, నక్కా రమణబాబు, చిత్తా బుజ్జి, సింగిడి సింహాచలం, గల్ల రుద్రకుమార్, గోపిశెట్టి సత్యారావు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

పెదగంట్యాడ: రామాయణాన్ని రచించి వాల్మీకి మహర్షి అయ్యారని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శాఖా గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ విద్యార్థులు సత్తా చాటి ఒక పసిడి, రెండు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ (అండర్‌-20) చాంపియన్‌షిప్ పోటీల్లో విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ (మెకానికల్) చదువుతున్న టి.ప్రణవశ్రీ 400 రిలే పరుగు పందెంలో పసిడి, కాంస్య పతకం దక్కించుకోగా, కె.మొనాలి 400 రిలే పరుగు పందెంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, పిజికల్ డైరెక్టర్లు రాంబాబు, ప్రశాంత్, రమణ,భారతి అభినందించారు.

సత్యసాయి మందిరంలో చండీ హోమం




హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్‌-2లోని సత్యసాయి మందిరంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి, సప్త రుషి వేద పాఠశాల సంయుక్తంగా స్టీల్‌ప్లాంట్ పునఃవైభవం, అభివృద్ధి కోసం గురువులు, వేద పండితులు హోమం చేశారు. మాధవ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ప్రొఫెసర్ వి.ఎస్.ఆర్. మూర్తి, సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, స్టీల్‌ప్లాంట్ సీజీఎం వి. శాంతకుమార్‌తో పాటు సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

అక్కిరెడ్డిపాలెం: పూజ కోసం పూలు తెంపుతున్న మహిళ మెడలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు అగంతకులు పుస్తెల తాడు తెంపుకెళ్లిపోయారు. గాజువాక క్రైం పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 69వ వార్డు నాతయ్యపాలెం శివారు ప్రాంతంలో నివాసం ఉంటున్న గేదెల పైడమ్మ గురువారం ఉదయం తన నివాసం పక్కన పూలు కోస్తుంది. ఈ సమయంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు అగంతకులు అటూ ఇటూ తిరుగుతూ చివరకు ఆమె వద్దకు వచ్చి హిందీలో అడ్రస్సు అడగడంతో ఆమె గ్రామం శివారు వీధి అని చెబుతుండగా వెనుక కూర్చున్న వ్యక్తి ఒక్క సారిగా ఆమె మెడలో తాడు తెంపి అక్కడ నుంచి పరారయ్యారు. హఠత్ పరిణామంతో ఆమె బిగ్గరగా కేకలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆమె కుమారుడు డయల్ 100కు సమాచారం అందించడంతో గాజువాక క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ మన్మథరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పరిసరాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

గంగవరం గ్రామస్తులకు పునరావాసం కల్పించాలి



బాధితులతో మాట్లాడుతున్న పల్లా కార్తీక్

గాజువాక: గంగవరం గ్రామంలో శిథిలమైన గృహాల్లో నివసిస్తున్న వారిని ఆదుకోవాలని పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పల్లా కార్తీక్ డిమాండ్ చేశారు. గ్రామంలో సుమారు 200 గృహాలు శిథిలావస్థకు గురై ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆ గృహాల్లోని నివాసులకు పునరావాసం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. నమ్మిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత లేదా అంటూ ఆయన ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కనీసం అధికారులైనా స్పందించరా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు గంగవరంలో కూలిపోయిన ఇంటితోపాటు శిథిలావస్థలో ఉన్న పలు గృహాలను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు వారికి పునరావాసం కల్పిస్తే కనీసం వారి ప్రాణాలను కాపాడినవారమవుతామన్నారు. గ్రామంలో 30 శాతం ఇళ్లు శిథిలమైపోయాయని గత తుపాను సమయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోతే భవిష్యత్‌లో తగిన విధంగా బాధితులు స్పందిస్తారని హెచ్చరించారు.

ముంచెత్తిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగి పొర్లిన గెడ్డలు
- చెరువులను తలపించిన రోడ్లు



పెదగంట్యాడ జంక్షన్ ఫైర్‌స్టేషన్ వద్ద నిలిచిన నీరు



దయాల్‌నగర్ బీసీ రోడ్డుపై నిలిచిన నీరు

పెదగంట్యాడ: వర్షం ముంచెత్తింది. మండలంలో గురువారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులు చెరువుల్లా మారాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి.. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. దయాల్‌నగర్, సమతానగర్, కోరాడ, బర్మా కాలనీ, నడుపూరు, గాంధీనగర్, రామచంద్ర నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ తదితర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని కాలువలన్నీ చెత్తాచెదారంతో నిండిపోవడంతో మురుగునీరు మొత్తం రోడ్లపైకి వచ్చేసింది. దీంతో స్థానికులు బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. అలాగే నడుపూరు, బర్మా కాలనీల్లోని మైదానాలు చిత్తడిగా మారాయి.

అగనంపూడి: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వివిధ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. చాలా వరకు దుకాణ సముదాయాలు కూడా మూసివేశారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు కూడా పెద్దగా కానరాలేదు.

అక్కిరెడ్డిపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం భారీ వర్షం కురవడంతో జనజీనం స్తంభించిపోయింది. ఆటోనగర్, తోకాడ, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెంలో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బైక్‌పై వస్తుండగా మూర్ఛ.. యువకుడి మృతి



లోకేష్ (ఫైల్)

అగనంపూడి: ఓ యువకుడు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా హఠాత్తుగా స్పృహ కోల్పోయి అదుపుతప్పి పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడ్ని స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా..దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి అగనంపూడి నిర్వాసితకాలనీ దిబ్బపాలెంకు చెందిన సిద్దినాటి వెంకటరమణ విశాఖ స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. రమణ కుమారుడు లోకేష్ కుమార్ (27) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. బుధవారం రాత్రి 9గంటల సమయంలో దిబ్బపాలెంను ఆనుకొని ఉన్న రైల్వే ట్రాక్‌పై లోకేష్ పడి ఉన్న విషయాన్ని గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శరీరంపై దెబ్బలు ఉండడంతో అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. లోకేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బైక్‌పై ప్రయాణిస్తుండగా మూర్ఛ రావడంతో అదుపుతప్పి పడిపోయాడు. ఈ క్రమంలో శరీరంపై గాయాలయ్యాయి. పోలీసులు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: పుట్టుకతో వచ్చే వ్యాధులకు తగిన చికిత్స అందించేందుకు కృషి చేస్తున్నామని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది బి.గోపాలం, బి.సరస్వతి, లక్ష్మి, ఉమ, సత్యవతి, జీనత్, వరలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొంగపాలెంలో కూలిన పెంకుటిల్లు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న దేవన్‌రెడ్డి, శ్రీను

పెదగంట్యాడ: వర్షాలకు జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని కొంగపాలెంలో ఓ పెంకుటిల్లు గురువారం కూలిపోయింది. ఇంట్లో ఉన్న నక్క రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. నక్క రెడ్డి అనే వ్యక్తి భార్య శ్యామలతో కలసి కొంగపాలెంలో నివాసం ఉంటున్నాడు. స్టీల్‌ప్లాంట్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ ఇల్లు నానిపోయింది. గురువారం ఉదయం ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న నక్క రెడ్డికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి వెంట పల్లా చినతల్లి, పల్లా పెంటారావు ఉన్నారు.


క్రీడల్లో రాణిస్తే గుర్తింపు



క్రీడా ప్రతిభా అవార్డు దక్కించుకున్న విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

అగనంపూడి: క్రీడల్లో రాణిస్తే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా వచ్చేనెల 2వ తేదీ నిర్వహించనున్న నెట్‌బాల్, 9న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనుండడంతో గురువారం ఆయన పాఠశాల ఆవరణలో వసతులను పరిశీలించారు. క్రీడాకారులకు ఇబ్బంది, ఆటంకం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్ మన్నాజీలను ఆదేశించారు. వసతుల కల్పనకు అవసరమైతే తాను సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభా అవార్డు దక్కించుకున్న కణితి హైస్కూల్ హెచ్‌ఎం ప్రకాశరావు, పీడీలు మన్నాజీ, నారాయణరావు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు విజయరామరాజు, సత్తిబాబు, వడ్రే రాంబాబు, కల్లేపల్లి శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్‌-1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వారం గిరి ప్రదక్షిణ ఉత్సాహంగా జరిగింది. గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణలో గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.